

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	40	26
భద్రాద్రి	40	26



రంజాన్‌వేళలు
ఇఫ్తార్ (సా) : 6:28 (మంగళవారం)
సహర్ (ఉ) : 4:41 (బుధవారం)

వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు



గుబ్బలమంగమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి తుమ్మల

- ఆగస్టు 15నాటికి లింక్ కెనాల్ పూర్తి
- రాష్ట్రంలో 12కుపైగా లోక్‌సభ స్థానాలు గెల్చుకుంటాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- జిల్లా సరిహద్దులోని గుబ్బల మంగమ్మ ఆలయంలో పూజలు



కొత్త కన్నాయిగూడెంలో కార్యకర్తలతో మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/అశ్వారావుపేట, ఏప్రిల్ 1: వచ్చే ఆగస్టు 15నాటికి వైరా లింక్ కెనాల్ పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు 'సీతారామ ఎత్తిపోతల పథకం' ద్వారా గోదావరి జలాలు అందించి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా అందరు రైతులకు రైతుబంధు అందజేస్తామని, ఇప్పటికే 5 ఎకరాలలోపు రైతులకు రైతుబంధు జమ చేశామని వివరించారు.

తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులోని అశ్వారావుపేట మండలం కొత్త కన్నాయిగూడెం దట్టమైన అటవీ ప్రాంతంలో వెలిసిన గుబ్బల మంగమ్మ ఆలయాన్ని సోమవారం మంత్రి సందర్శించి పూజలు చేశారు. అక్కడున్న గిరిజనులతో మాట్లాడారు. 1983లో మొదట ఈ ఆలయాన్ని సందర్శించానని, తర్వాత మంత్రి అయిన తర్వాత ఇక్కడున్న కొండరెడ్లకు భూములు, పక్కా ఇళ్ల ఏర్పాటు చేయడం జరిగిందని, వారిని పాత కన్నాయిగూడెం కొండలపై నుంచి కొత్త కన్నాయిగూడేనికి తరలించి జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చి అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. పాత కన్నాయిగూడెంలో గిరిజనులతో మాట్లాడిన అనంతరం కొత్త కన్నాయిగూడెంలో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు.

సీతారామ సాగునీటి ప్రాజెక్టుకు లిఫ్టులు నిర్మాణం పూర్తయినా కెనాల్స్ నిర్మాణంలో వరుసక్రమంలో పూర్తికాలేదని, గత ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన వందరోజుల్లో సీతారామ పనులు వేగవంతం చేయిస్తున్నామని చెప్పారు. వైరా లింక్ కెనాల్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామని, 7కి.మీ. లింక్ కెనాల్ పూర్తయితే వైరా రిజర్వాయర్ నుంచి లంకాసాగర్‌తోపాటు పలు చెరువులకు, ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందుతుందని, లక్షా 50వేల ఎకరాలకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. పాలేరు రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపడం ద్వారా వేసవిలో ఖమ్మంజిల్లాతో పాటు పొరుగున ఉన్న మహబూబాబాద్ జిల్లాకు తాగునీటి ఎద్దడిరాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 12కుపైగా లోక్‌సభ స్థానాలు గెలిచి తీరుతుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ప్రధాన పోటీ ఉంటుందని, కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో మాత్రమే బీఆర్ఎస్‌తో పోటీ ఉంటుందన్నారు. తుమ్మల వెంట కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, చావా నారాయణరావు, కమర్తపు మురళి, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల ఎలగొండస్వామి, పామాయిల్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కరరావు, బండి పుల్లారావు, సుంకపల్లి వీరభద్రరావు, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల్ పుల్లారావు తదితరులున్నారు.



40 ఏళ్ల నాటి బంధం

మంత్రి తుమ్మల పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కొత్త కన్నాయిగూడెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన ఒక రైతును చూసి 'సత్యనారాయణ గారూ... బాగున్నారా!?' అంటూ పలకరించారు. '1983లో నేను మొదటిసారి గుబ్బల మంగమ్మ ఆలయానికి అడవిలో 5 కి.మీ. నడిచి వెళ్లి ఆకలితో వస్తే నాకు మీ ఇంటిలో అన్నం పెట్టారు. నాకు గుర్తుంది... ఈ రోజు మీ ఇంటికి వస్తా.. టీ తాగి వెళతా..' అని చెప్పారు. మంత్రి మాటలు విన్న చిలుకూరి సత్యనారాయణ సంభ్రమాశ్చర్యాలు చెంది వెంటనే కుటుంబసభ్యులకు తెలిపారు. మీడియా సమావేశం అనంతరం మంత్రి పాత కన్నాయిగూడెంలోని రైతు సత్యనారాయణ ఇంటికి వెళ్లారు. వారి కుటుంబాన్ని పలకరించారు. కలిసి టీ తాగారు. కాగా, మంత్రి తమ ఇంటికి రావడంతో సత్యనారాయణ కుటుంబం ఆనందంతో తబ్బిబ్బయింది.

తీరనున్న తాగునీటి సమస్య

సాగర్ నుంచి పాలేరుకు నీటి విడుదల

ఖమ్మం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి పాలేరు జలాశయానికి ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. సోమవారం మంత్రి తుమ్మల గుబ్బల మంగమ్మ దేవాలయాన్ని సందర్శించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్ తదితరులతో ఫోన్‌లో మాట్లాడారు. పాలేరు జలాశయంలో ఒక్కరోజుకు సరిపడ నీరు మాత్రమే ఉందని, తక్షణం సాగర్‌నుంచి నీరు విడుదల చేస్తే తాగునీటి సమస్య ఉండదని ఫోన్‌లో ఆదేశించారు. దీంతో సాగర్‌నుంచి పాలేరుకు సోమవారం సాయంత్రం నీరు విడుదల చేశారు.



ఎండిపోయిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు

సర్కారు తీరు వల్లే పంటలు ఎండుతున్నాయి...

- మొక్కజొన్న, వరి పంటలకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలి
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

కొణిజర్ల, ఏప్రిల్ 1: కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహనలోపం వల్ల ఈనాడు రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోయాయని, ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సాలెబంజర గ్రామంలో ఎండిపోయిన మొక్కజొన్న పంటలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగు, తాగునీరు సమస్యతీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15లక్షల ఎకరాల వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలుదాటినా రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని, వేసవికాలంలో సాగర్‌జలాలతో చెరువులు, రిజర్వాయర్‌లు నింపాలని కూడా తెలవడంలేదన్నారు. నీటి సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోట్ల కవిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో రగులుతున్న అటవీభూమి వివాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇక్కడ రెండు గ్రామాల గిరిజనుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ.. పోలీసులపై దాడికి దారి తీయడం ఒకవైపు కలకలం రేపగా, మరోవైపు అధికారుల నిష్క్రియాపరత్వాన్ని కళ్లకు కడుతోంది. 15 ఏళ్లుగా వివాదం రగులుతున్నా.. అటు అటవీ, ఇటు రెవెన్యూ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో వివాదం చిలికి చిలికి గాలివానగా మారి శాంతి భద్రతల సమస్యగా పరిణమిస్తోంది. సదరు భూమికి సంబంధించి తమకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయని బుగ్గపాడు గిరిజనులు, తమకు చెట్టు పట్టా ఉందని చంద్రాయపాలెం గిరిజనులు చెబుతుండగా, అసలు అది రెవెన్యూ భూమియే కాదని రెవెన్యూ అధికారులు సెలవిస్తున్నారు. మరోవైపు వన సంరక్షణ సమితులు అమల్లో లేని కారణంగా చెట్టుపట్టాలు చెల్లవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా చంద్రాయపాలెం వివాదంపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో తరచూ జరుగుతున్న ఘర్షణలు, గొడవలు పోలీసులకు తలనొప్పిగా మారుతున్నాయి.



చంద్రాయపాలెంలో వివాదాస్పద భూమి ఇదే..

రెండు ఊళ్లు.. ఒక వివాదం

- 15 ఏళ్లుగా రగులుతున్న చంద్రాయపాలెం భూ వివాదం
- ఏటా గొడవలు జరుగుతున్నా..పట్టించుకోని రెవెన్యూ, అటవీశాఖల అధికారులు
- తమకు రెవెన్యూశాఖ పట్టాలిచ్చిందంటున్న బుగ్గపాడు గిరిజనులు
- అటవీశాఖ చెట్టుపట్టా ఇచ్చిందంటున్న చంద్రాయపాలెం గిరిజనులు
- ఎవరికీ హక్కులు లేవంటున్న అధికారులు
- ప్రతీ ఏటా శాంతిభద్రతల సమస్యగా మారుతున్న వివాదం
- పోలీసులపై దాడి ఘటనతో మరింత ముదిరిన పంచాయితీ
- జాయింట్ సర్వే చేస్తేనే వివాదానికి ముగింపు

సత్తుపల్లి, ఏప్రిల్ 1: సత్తుపల్లి మండలంలోని చంద్రాయపాలెంలో 400ఎకరాల అటవీ భూమిలో ప్రస్తుతం ఆ శాఖ యూకలిప్టస్ సాగు చేస్తోంది. 1999 నుంచి వనసంరక్షణ సమితి ఏర్పాటు చేసి కొంత భూమిలో చంద్రాయపాలెం గిరిజన కుటుంబాలకు ఫలసాయం అందిస్తున్నారు. రెండేళ్ల క్రితం కూడా సుమారు పది హెక్టార్లలో యూకలిప్టస్ నరికించి చంద్రాయపాలెం గిరిజనులకు 50 శాతం ఫలసాయం అటవీశాఖ చెక్కుల రూపంలో అందజేసింది. ప్రస్తుతం సదరు భూమిని శుభ్రం చేసి తిరిగి మొక్కలు నాటాలని అటవీశాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో బుగ్గపాడు గిరిజనులు ఆ భూమిపై తమకూ హక్కులున్నాయంటూ రావటంతో ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో జరిగిన గొడవలో సత్తుపల్లి పట్టణ సీఐ, కానిస్టేబుళ్లపై బుగ్గపాడు గిరిజనులు దాడి చేసిన విషయం విదితమే.



పాస్‌పుస్తకాలు చూపుతున్న బుగ్గపాడు గిరిజనులు

1999లో చెట్టు పట్టా

చంద్రాయపాలెం గిరిజనులకు 1999లో అటవీశాఖ 170ఎకరాల్లో వీఎస్ఎస్ చట్టం ప్రకారం చెట్టు పట్టాలను ఇచ్చిందని, ఈ మేరకు అటవీభూమిలో ఫలసాయం తమకు ఇవ్వాల్సి ఉంటుందని చంద్రాయపాలెం గిరిజనులు వాదిస్తున్నారు. దీనికి సంబంధించి తమ వద్ద అన్ని హక్కు పత్రాలు ఉన్నాయని చూపుతున్నారు. ఈ భూమితో సంబంధంలేని బుగ్గపాడు పరిసర గ్రామాల వారు వచ్చి సదరు భూమిలో ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుందని వారు ఆరోపిస్తున్నారు.

బుగ్గపాడు గిరిజనులు ఏమంటున్నారంటే..

చంద్రాయపాలెంలో తమ పూర్వీకులు నివాసం ఉండేవారని, 1976-77లోనే తమ తాతలు, తండ్రుల

మిగతా 6వ పేజీలో



హక్కుపత్రాలను చూపుతున్న చంద్రాయపాలెం గిరిజనులు



మిర్చి ధరల తిరోగమనం

నెలరోజుల్లో క్వింటాకు రూ.2,000 తగ్గుదల

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 1: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం మిర్చి ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. మార్కెట్‌లో సోమవారం క్వింటా మిర్చిని రూ.19,500 జెండాపాట నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటా రూ.11,000 నుంచి రూ.15,000వరకు మాత్రమే కొనుగోలు చేశారు. మార్చిలో క్వింటా రూ.21,500 పలికిన మిర్చి ధర ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వస్తోంది. నెలరోజుల క్రితం ధరతో పోలిస్తే క్వింటాకు సుమారు రూ.2,000 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌కు మిర్చి పోటెత్తుతున్న నేపథ్యంలో వ్యాపారులు ఉద్దేశ్యపూర్వకంగానే ధరలు తగ్గిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

ఈ సంవత్సరం చీడపీడలు, వర్షాభావ పరిస్థితులతో మిర్చి దిగుబడి పడిపోయిందని రైతులు ఆందోళన చెందుతుండగా మార్కెట్‌లో సైతం పంట ధరలు తగ్గుముఖం పట్టడంతో వారి ఆశలు అడియాసలవుతున్నాయి. ఖమ్మం మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలనుంచి తేజ రకం మిర్చిని రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. సోమవారం మార్కెట్‌కు సుమారు 40వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

తేజ రకం మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు ఉంటే ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మిర్చి ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు తమ పంటను కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

వేసవి వేళ సర్వ సన్నద్ధం



- ప్రజల ఆరోగ్య సంరక్షణకు అన్ని చర్యలు
- ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- జిల్లా ఆస్పత్రిలో ఐదు పడకలతో బాధితులకు చికిత్స
- వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మాలతి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 1: 'వేసవి తీవ్రత పెరుగుతోంది.. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ బి.మాలతి సూచించారు. గత నెల 27న 'వేసవి వేళ ఏదీ యాక్షన్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ క్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ తరపున చేపడుతున్న చర్యలను డీఎంహెచ్‌వో వివరించారు.

ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు

జిల్లాలో అన్ని మండలాల్లోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, 'ఆశా' కార్యకర్తలతో బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల పరిధిలో ఎవరికైనా వడదెబ్బ తగిలినట్లు సమాచారం అందితే ఈ బృందాలు వైద్య చికిత్సలు అందిస్తాయని చెప్పారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు తాగునీటిని అందించేలా కృషి చేయనున్నాం.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు

'జిల్లాలో 26 ప్రాథమిక, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 3 నుంచి 5వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాం. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో ఇవి అందుబాటులో ఉంటాయి. వడదెబ్బ, డీహైడ్రేట్‌కు గురైన వారికి చికిత్సల కోసం ఐవీ ఫ్లూయిడ్స్ సెలైన్ బాటిళ్లను అందుబాటులో ఉంచాం. ఎండదెబ్బ తగలకుండా విద్యార్థులకు పాఠశాలల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని సూచించాం.' అని డీఎంహెచ్‌వో తెలిపారు. ప్రతి రోజు మజ్జిగ గ్లూకోస్ నీరు, చిటికెడు ఉప్పు, చెంచా చెక్కర గ్లాసు నీటితో కలుపుకొని తాగితే వడదెబ్బ నుంచి ఉపశమనం పొందవచ్చని, ఎండతీవ్రంగా ఉన్నప్పుడు ఆరుబయట పనిచేసే వారు సూర్యరశ్మి నుంచి కాపాడుకొనేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గంటకో మారు నీళ్లు తాగాలని, బయటకు వెళ్లేటప్పుడు ఇంటి నుంచే నీళ్లు తీసుకెళ్లాలని అన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కేంద్రమైన ఖమ్మంలో వైద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా 24గంటల పాటు పనిచేసేలా ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 'ఎవరైనా వడదెబ్బకు గురైనా, ఎండకు అపస్మారక స్థితికి చేరుకున్నా సమాచారాన్ని జిల్లా కేంద్రంలోని **8501003838, 86395 22447** నెంబర్‌కు తెలియపరిస్తే తక్షణమే అందుబాటులో ఉన్న అంబులెన్స్‌తో పాటు వైద్య చికిత్సలకు దగ్గర్లోని పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉంటారు..' అని డీఎంహెచ్‌వో తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి...

ఎండవేడిమి దృష్ట్యా ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లనుంచి బయటకు రాకుండా ఉండడమే శ్రేయస్కరం. ఒక వేళ తప్పనిసరిగా రావాల్సి వస్తే తలకు టోపీ, తెల్లని దుస్తులు ధరించాలి. కళ్లద్దాలు పెట్టుకోవాలి.. చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు బయటికి రావొద్దు' అని డీఎంహెచ్‌వో అన్నారు. వడదెబ్బ తగిలిన వారిని నీడలో చల్లని ప్రదేశాల్లో ఉంచాలని శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు తడిగుడ్డతో తుడుస్తూ ఉండాలని, ఆ తర్వాత ఆస్పత్రికి తరలించాలని ఆమె సూచించారు.

దైవమే దిగిరావాలా?

అభివృద్ధికి ఆమడదూరంలో
జమలాపురం స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయం

6

ఎండిన వైరా నది, కట్లేరు

- చుక్కనీరు లేని జాలిముడి ప్రాజెక్టు
- బ్యాక్ వాటర్ లేక తగ్గిన భూగర్భ జలాలు



నేరెళ్ళ శ్రీనివాసరావు (అధ్యక్షుడు)



సీహెచ్. వెంకటేశ్వరరావు (ప్రధాన కార్యదర్శి)

ఖమ్మం బార్ అధ్యక్షుడిగా 'నేరెళ్ల'

- ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు
- బార్‌కౌన్సిల్ ఆదేశాలతో ఓట్ల లెక్కింపు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 1: ఖమ్మం బార్ అసోసియేషన్‌కు గత నెల 28న జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నగరానికి చెందిన నేరెళ్ల శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 946గాను 757మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిలిపివేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నేరెళ్ల శ్రీనివాసరావు తన సమీప ప్రత్యర్థి కన్నెబోయిన నాగేశ్వరరావుపై 352ఓట్ల మెజారిటీతో, ప్రధాన కార్యదర్శిగా చింతనిప్పు వెంకటేశ్వరరావు 289ఓట్ల మెజారిటీతో, గ్రంథాలయ కార్యదర్శిగా కన్నెగంటి గోపి 21ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కె.ఉపేంద్రరెడ్డి, జాయింట్ సెక్రటరీగా కందే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎజ్జగాని శ్రీనివాసరావు, క్రీడల సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా, సోమవారం సాయంత్రం ఎన్నికల అధికారులు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్‌రాజు, రాయల పావెల్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులు న్యాయాధికారులను కలిశారు.

దైవమే దిగిరావాలా?

అభివృద్ధికి ఆమడ దూరంలో జమలాపురం స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయం


జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం

- ఉత్సవాలకు నిధులు ఇవ్వని దేవాదాయ శాఖ
- దాతల వితరణతోనే కొనసాగున్న కైంకర్యాలు, అభివృద్ధి పనులు
- శ్రీవారి కల్యాణం జరిపించడానికి సామాన్య భక్తులకు నిరాకరణ
- ప్రతీ సంవత్సరం కేవలం ఉప్పల వంశీయులకే అవకాశం
- పదేళ్లలో ఒక్కసారే ఏర్పాటైన పాలకమండలి

జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలనా పాలనా అంతా దాతలదే. అన్నీ తామై వారు వితరణ చేయకుంటే ఆలయంలో ఉత్సవాలు, కైంకర్యాలు ఆగిపోవాల్సిందే. ముందుండి అభివృద్ధి చేయాల్సిన దేవాదాయ శాఖ ఎందుకో గాని శ్రీవారి ఆలయంపై శీత కన్ను వేస్తోంది. తెలంగాణ తిరుపతిగా పిలుస్తున్న కోవెలకు నిధుల వరద కురిపించాల్సిన అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఫలితంగా రావాల్సినంత ఆదరణ ఈ క్షేత్రానికి రావడం లేదు. ఉన్నతాధికారులు పాలకమండలి ఏర్పాటును మర్చిపోయారు. కల్యాణంలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడం లేదు. కనీసం ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలూ అమలు కావడం లేదు.

ఎర్రుపాలెం, ఏప్రిల్ 1: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దాతల సహకారంతోనే ప్రత్యేక పూజలు, నిత్యాన్నదానం, వసంత నవరాత్రి, శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. కేవలం పరిపాలన విభాగానికి తప్ప.. దేవాదాయశాఖ నుంచి ఈ కార్యక్రమాలకు చిల్లిగవ్వ కూడా కేటాయింపులు లేవు. ప్రధాన ఆలయంలో గాలి గోపురం, యాగశాల, చుట్టూ షెడ్ల నిర్మాణం, గరుడాలయం, కోనేరు, తాగునీటి వసతి, మెట్లపై షెడ్డు నిర్మాణం, ఆవరణలో అన్నదాన సత్రం, వేలం పాట కొట్లు, శ్రీనివాస, శేషసాయి, పద్మావతి కాంప్లెక్స్‌ల నిర్మాణం, తల నీలాల భవనం, కల్యాణ మండపం, చారుగుండ్ల వసతి గృహం అన్నీ కూడా దాతల ఆర్థిక సహకారంతోనే నిర్మితమయ్యాయి. ప్రస్తుతం ధార్మిక భవనం, శ్రీవారి కల్యానం నిర్వహించేందుకు వకుళాభరణం స్టేడియం నిర్మాణంలో ఉన్నాయి. దశాబ్ద కాలంగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఖమ్మం నగరానికి చెందిన కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు చేయూతనిస్తున్నారు. సొంత ఖర్చులతో శ్రీవారి కల్యాణం అనంతరం గ్రామోత్సవం, తెప్పోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు.


దాతలు తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు

కల్యాణం టికెట్లపై వీడని సందిగ్ధం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలివేలు మంగా, పద్మావతి సమేతంగా శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు. అయితే మిగతా దేవాలయాల్లో మాదిరిగా భక్తులు, దంపతులు పీటల మీద కూర్చొని కల్యాణంలో పాల్గొనే అవకాశం ఈ ఆలయంలో లేదు. ఈమేరకు కల్యాణం టికెట్లను అందుబాటులోకి తేవడం లేదు. ఎవరైనా కల్యాణం చూసే అవకాశమేగాని.. జరిపించే అవకాశాన్ని దేవాలయ అధికారులు ఇవ్వడం లేదు. అన్ని ప్రధాన ఆలయాల్లో కల్యాణంలో భక్తులు పాల్గొంటున్నా జమలాపురంలో మాత్రం నిరాకరిస్తున్నారు. ఉప్పల వంశీయులకే ఈ అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఈ విషయమై ఆలయ అధికారులపై తీవ్ర వత్తిడి వచ్చింది. వచ్చే ఏడాది అవకాశం ఉంటుందని పెద్దలు చెప్పడంతో వివాదం సద్దుకుంది. కల్యాణ సమయంలో సమీపిస్తున్నా అధికారులు మాత్రం ఈ అంశంపై స్పష్టత ఇవ్వడం లేదు.

పాలకమండలి ఏర్పాటులో జాప్యం

జమలాపురం ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి పాలకమండలిగా ఉంటుంది. వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్‌గా, రాజకీయ నాయకులు సభ్యులుగా కొనసాగడం అనవాయితిగా వస్తోంది. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక దశాబ్ద కాలంగా2016 సంవత్సరంలో మాత్రమే పాలక మండలిని ఏర్పాటు చేశారు. తర్వాత ప్రకటనలు వచ్చాయి తప్పా పాలకమండలి ఏర్పాటు కాలేదు. ఈ కారణంతో కొన్ని పరిపాలనా సంబంధించిన నిర్ణయాలను తీసుకోకపోవడంతో ఆలయ పురోగతికి అడ్డుగా మారింది. చైర్మన్‌ను ఎన్నుకోకుండా ట్రస్టు బోర్డు డైరెక్టర్లుగా మాత్రమే నామినేట్ చేయడం ఎందుకనే భావనతో ట్రస్ట్ బోర్డుకు రాజకీయ నాయకులు ఆసక్తి చూపడం లేదు. జమలాపురం ఆలయంలో ఉప్పల వంశీయులే అర్చకులుగా, వ్యవస్థాపక ధర్మకర్తలుగా, ఆలయ చైర్మన్లుగా కొనసాగుతున్నారు.

9నుంచి బ్రహ్మోత్సవాలు

జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 9 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయంలో యేటా చైత్ర మాసంలో వసంత నవరాత్రి, ఆశ్వీయుజ మాసంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

హామీలు అమలైతే వేగంగా అభివృద్ధి..

జమలాపురం ఆలయాన్నీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి చేయాలని ఇక్కడ ప్రజలు కోరుకుంటున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మధిర ఎన్నికల ప్రచారంలో భాగంగా జమలాపురం ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి పట్టించుకోలేదు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇప్పటి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధికి స్పష్టమైన హామీ ఇచ్చారు. గత అసెంబ్లీలో దేవాలయాల అభివృద్ధి విషయంలో వేములవాడ రాజన్న ఆలయంతో పాటు జమలాపురం ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో నైనా ఆలయం పురోగతి సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు.


నిర్మాణంలో ఉన్న వకుళాభరణం స్టేడియం


నిత్యకల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య

- గత నెలలో స్వామిని దర్శించిన భక్తులు 2,15,450మంది

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. మార్చి నెలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని 2,15,450 మంది భక్తులు దర్శించుకోగా మార్చి 25న అధిక సంఖ్యలో 14,304 మంది దర్శించుకున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు



చుంచుపల్లి, ఏప్రిల్ 1: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా అధికారులకు భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు సోమవారం ఆదేశించారు. ఈ వేసవి కాలంలో ప్రతి గ్రామంలో నీటి అవసరాలను, నీటి సౌలభ్యతను గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ ఎస్ఈ జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. తమ క్రింది స్థాయి అధికారులను, ఉద్యోగులందరిని అప్రమత్తం చేయాలని సూచించారు. నీటి ఎద్దడి నివారించేందుకు ముందస్తుగా ప్రత్యేక రక్షణతో కూడిన ముందస్తు కార్యచరణ రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఎన్నికల్లో ఆదివాసీల సత్తా చాటాలి'

దుమ్ముగూడెం, ఏప్రిల్ 1: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో లంబాడా అభ్యర్థులను ఓడించి ఆదివాసీల న్యాయమైన ఉద్యమాన్ని బలపర్చాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి డా.మహిపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపల్లి, కోయనర్సాపురం గ్రామాల్లో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. లంబాడాలు ఎస్టీలు కాదని బలమైన ఉద్యమాలు చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు లంబాడాలకే పెద్దపీట వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో లంబాడాలకు ఒక్క ఓటు కూడా పడకూడదని పిలుపునిచ్చారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాల తొలగింపే లక్ష్యంగా ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏపీఎస్ రాష్ట్ర నాయకులు ఎస్ పాపారావు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, జీఎస్పీ నాయకులు రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్

కొత్తగూడెం, ఏప్రిల్ 1: ఎండలు ముదురుతుండగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యపరంగా వారికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం పాల్వంచలోని కిన్నెరసాని బాలుర ఆశ్రమ పాఠశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా శిక్షణ కలెక్టర్ యువరాజ్ మర్మాడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, డైనింగ్ హాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక పూట తరగతులు నడుస్తున్నందున మధ్యాహ్నం సమయంలో పిల్లలను ఎవరినీ బయటకు పంపవద్దని అన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, పాఠశాలల్లో తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎవరైన పిల్లలకు వడదెబ్బ తగిలితే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని, ప్రతిరోజు పిల్లలకు తప్పని సరిగా ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగించాలన్నారు. సాయంత్రం సమయంలో వాతావరణం చల్లబడిన తర్వాత పిల్లలకు ఆటలు ఆడించాలన్నారు. పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తప్పని సరిగా మెను ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఎప్పటికపుడు బయటపడేయాలని తెలిపారు. పాఠశాలకు ఏమైన మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు తనకు పంపించాలని ఆయన హెచ్ఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందు, ఉపాధ్యాయులు రవి, సురేష్, పీఈటీలు వీరన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్

ఎండిన వైరా నది, కట్లేరు

- చుక్కనీరు లేని జాలిముడి ప్రాజెక్టు
- బ్యాక్‌వాటర్‌లేక తగ్గిన భూగర్భ జలాలు


వట్టిపోయిన జాలిముడి ప్రాజెక్టు

వైరా, ఏప్రిల్ 1: జాలిముడి ఆనకట్టకు గుండెకాయ లాంటి వైరా నది, కట్లేరు పూర్తిగా ఎండిపోయాయి. వైరా నదిపై మధిర మండలం జాలిముడి, వైరా మండలం గన్నవరం సరిహద్దుల్లో జాలిముడి ఆనకట్టను పుష్కర కాలం కిందట నిర్మించారు. ఈ ఆనకట్టకు వెనుకభాగంలో వైరా నది, కట్లేరు సంగమం చెందుతాయి. అయితే తీవ్ర ఎండలతో వైరా నది, కట్లేరులో నీరు లేక జాలముడి ఆనకట్ట వెలవెలబోతోంది. ఉమ్మడి ఏపీలో ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో వైరా, కట్లేరు అనుసంధానమయ్యే జాలిముడి ప్రాంతంలో ఆనకట్ట నిర్మించారు. ఇక అప్పటి నుంచి ఈ ఆనకట్ట బ్యాక్‌వాటర్‌తో వేలాది ఎకరాల్లోని పొలాలు సస్యశ్యామలమయ్యాయి. తెలంగాణలోని మధిర, వైరా నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే జాలిముడి, మల్లారం, రొంపిమళ్ల, గన్నవరం, దాచాపురం, గరికపాడు, ఖానాపురం అలాగే ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి, ఉమ్మడదేవరపల్లి గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లోని పంటలకు జాలిముడి బ్యాక్‌వాటర్ ఎంతో ఉపయోగపడుతుంది. యేటా ఖరీఫ్, రబీల్లో పుష్కలంగా పంటలు పండుతున్నాయి.

రైతులు వైరా నది, కట్లేరుకు నేరుగా వ్యవసాయ మోటార్లు ఏర్పాటుచేసుకున్నారు. అనేకమంది రైతులు తమ పొలాల్లోనే బోర్లు వేసుకున్నారు. జాలిముడి బ్యాక్‌వాటర్ వలన బోర్లలో కూడా పుష్కలంగా నీరుండేది. అయితే గత రెండునెలల నుంచే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు బ్యాక్‌వాటర్ పూర్తిగా ఎండిపోయింది. పశువులకు సైతం తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. యాసంగిలో వేసిన వరిపంటకు ఇంకా ఒకట్రెండు తడుల నీటి అవసరముంది. నీరు మొత్తం ఎండిపోవడంతో పంటలు నిట్టనిలువునా కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పుడు పూర్తిగా నీరు లేకుండా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వైరా రిజర్వాయర్‌లో కూడా నీటిమట్టం అడుగంటిపోవడంతో జాలిముడి ఆనకట్టకు చుక్క నీరు ఇచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో తాము సాగుచేసిన పంటలకు సంబంధించి లక్షలాదిరూపాయలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.


జాలిముడి ఆనకట్ట సమీపంలో ..

రెండు ఊళ్లు.. ఒక వివాదం...

పాస్‌బుక్‌లపై గందరగోళం

తమ వద్ద రెవెన్యూశాఖ ఇచ్చిన పట్టాలు, పాస్‌పుస్తకాలున్నాయని బుగ్గపాడు గిరిజనులు చెపుతుండగా, రెవెన్యూశాఖ మాత్రం ఈ వివాదంతో తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. వారికి ఆ పాస్‌పుస్తకాలు ఎవరిచ్చారు, గిరిజనులకు ఉన్న హక్కులు ఏంటి అనే అంశాలపై శాశ్వత చర్యలు తీసుకోలేదు. ఏళ్ల తరబడి సమస్య కొనసాగుతున్నా ఇటు అటవీ, అటు రెవెన్యూ శాఖలు ఎటూ తేల్చకపోవటంతో వివాదం రగులుతూనే ఉంది. వాస్తవంగా ఇది రెవెన్యూ భూమి కాదని ఆ శాఖ అధికారులు చెపుతున్నా.. బుగ్గపాడు గిరిజనులకు పాస్‌పుస్తకాలు ఎలా వచ్చాయన్నది మాత్రం స్పష్టం చేయటం లేదు. సత్తుపల్లిలో ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించిన సమయంలో కూడా ఈ సమస్య ప్రస్తావనకు రాగా, అవసరమైతే జాయింట్ సర్వే చేసి వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఇదిలావుండగా, 362/2 సర్వే నెంబర్‌లోని 291.18 ఎకరాల భూమి విషయంలో కూడా రెవెన్యూ, అటవీశాఖ మధ్య వివాదం నెలకొంది. ఈ భూముల్లో రెవెన్యూ శాఖ గిరిజనులకు పట్టాలు జారీ చేసింది. సర్కారీ పోరంబోకు భూములు కావడంతో పట్టాలు ఇచ్చినట్టు రెవెన్యూ శాఖ చెబుతుండగా, అది పూర్తిగా తమ భూమేనని అటవీశాఖ స్పష్టంచేస్తోంది. ఈ వివాదాన్ని కూడా తేల్చాల్సి ఉంది.

(5వ పేజీ తరువాయి)

పేరుతో రెవెన్యూ శాఖ 343 నుంచి 349 సర్వే నెంబర్ వరకూ ఉన్న భూమిలో పట్టాలు ఇచ్చిందని బుగ్గపాడు గిరిజనులు చెబుతున్నారు. కాలక్రమంలో పాస్ పుస్తకాలు కూడా జారీ చేశారని, ఈ భూములపై తాము రుణాలు కూడా తీసుకున్నామని చెబుతున్నారు. అయితే తమ పూర్వీకులు చంద్రాయపాలెం గ్రామం విడిచి బుగ్గపాడు పరిసర గ్రామాల్లో స్థిరపడ్డారని తెలిపారు. అప్పట్లో తమ పూర్వీకులు సాగు చేసుకున్న భూములకు సంబంధించి అటవీశాఖ వీఎస్ఎస్ పేరుతో స్థానికులకు ఫలసాయం ఇస్తోందని ఆరోపించారు. తమకు హక్కులు ఉన్న ప్రదేశంపైకి రానివ్వటం లేదని ఆరోపించారు. ఎప్పటికప్పుడు తమను చంద్రాయపాలెం గిరిజనులు, అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

2009 నుంచి వివాదం

2009 నుంచి ఈ వివాదం నడుస్తోందని చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనులు చెబుతున్నారు. అప్పటినుంచి బుగ్గపాడు గిరిజనులు తమ భూములకు అడ్డు తగులుతున్నారని చంద్రాయపాలెం గిరిజనులు చెపుతుండగా.. తమ హక్కు పత్రాలు తీసుకొని భూముల్లోకి వెళ్లిన ప్రతిసారి తమను చంద్రాయపాలెం గిరిజనులు, అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని బుగ్గపాడు గిరిజనులు ఆరోపిస్తున్నారు. 15ఏళ్లుగా పోరాడుతున్నా.. కనీసం సమస్యకు పరిష్కారం చూపటం లేదని చెబుతున్నారు. ఆదివారం కూడా తాము భూముల్లోకి వెళితే పోలీసులు మినహా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నారు. తమ వద్ద ఉన్న పాస్‌పుస్తకాలకు సంబంధించి రెవెన్యూ శాఖ సమాధానం చెప్పాలని బుగ్గపాడు గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల తలోమాట

చంద్రాయపాలెంలో వివాదాస్పద భూమి రెవెన్యూ శాఖకు సంబంధించినది కాదని సత్తుపల్లి తహసీల్దార్ యోగీశ్వరరావు తెలిపారు. అది అటవీశాఖకు చెందిన భూమే అన్నారు. తాను ఇటీవలే సత్తుపల్లిలో విధుల్లో చేరానని, తనకు ఈ భూవివాదం విషయంలో ప్రస్తుతానికి అంతకు మించి తెలియదన్నారు. పూర్తి వివరాలు కావాలంటే రికార్డులు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. దీనిపై అటవీశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ వివాదాస్పద భూమితో చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనులకు సంబంధం లేదని, గతంలో వీఎస్ఎస్ ద్వారా ఫలసాయం అందించామని ప్రస్తుతం వీఎస్ఎస్ అమల్లో లేని కారణంగా ఎవరికీ సంబంధం లేదన్నారు. తాము చదును చేసిన భూమిలో మొక్కలు నాటుతామని తెలిపారు. ఈ వివాదంపై వివరణ కోరేందుకు అటవీశాఖ మండల, డివిజన్‌స్థాయి అధికారులకు ఫోన్ చేసినా వారు అందుబాటులోకి రాలేదు.

27 మందికి రిమాండ్

చంద్రాయపాలెం ఘటనలో పోలీసులపై దాడిచేసిన 27మందిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ సోమవారం రాత్రి తెలిపారు. ప్రధాన సూత్రదారులు మద్దిశెట్టి సామేలు, కారం మహేంద్రలతో సహా 27మందిని మండలంలోని బుగ్గపాడు వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఘటన జరిగిన ఆదివారం రోజు 20మందిని రిమాండ్ చేసిన విషయం విధితమే. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఆదివారం 20మందిని అరెస్ట్ చేయగా ఇప్పటివరకు ఈ కేసులో అరెస్ట్ చేసిన వారి సంఖ్య 47కు పెరిగింది.

నేడు ఇల్లెందులో 'మానుకోట' కాంగ్రెస్ సమావేశం

- హాజరవనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఇల్లెందులో లోక్‌సభ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30గంటలకు జరిగే ఈ సమావేశంలో లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో పాటు కాంగ్రెస్ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఇతర నాయకులు హాజరుకావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్‌కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

అగ్నిప్రమాదంపై మంత్రి తుమ్మల ఆరా

ఖమ్మం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనపర్తి జిల్లా పెబ్బేరు మార్కెట్ గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఆరా తీశారు. సంఘటనా స్థలానికి వెళ్లి జరిగిన నష్టంపై సమగ్ర నివేదికి ఇవ్వాలని మార్కెటింగ్‌తో పాటు ఇతర అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

నగదు పట్టివేత

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న ఓ వ్యక్తి వద్దనుంచి రూ.1,45,400 నగదును సోమవారం త్రీటౌన్ పోలీసులు, ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా నగరానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నగదును తీసుకెళ్తుండగా ఎన్నికల అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిజాంపేటలోని ఓ బెల్టుషాపులో వన్‌టౌన్ పోలీసులు తనిఖీచేయగా రూ. 2,900 విలువచేసే 17 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలపై పోలీసులు కేసునమోదుచేశారు.

నోటికాడి పంటలు ఎండినట్లేనా..

- ఎన్నెస్పీ ప్రధాన కాలువలో బావులు పూడ్చిన అధికారులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 1: నోటికాడికొచ్చిన పంటలు నీరులేక నిలువునా ఎండిపోతుండగా వాటిని కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. బావులు, బోర్లు ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు ఖమ్మం రూరల్ మండలం, ముత్తగూడెం గ్రామంలో రైతులు సాగర్ ప్రధాన కాల్వలో బావులు తవ్వి మోటార్ల ద్వారా పంటలకు సాగునీరందిస్తున్నారు. మరో పదిరోజులు నీరు అందిస్తే పంటలు ఇంటికి చేరుతాయి. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో సాగర్ కాల్వలో రైతులు తీసిన బావులను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు పూడ్చివేశారు. అధికారుల నిర్వాకంతో నోటికాడికొచ్చిన పంటలు నిలువునా ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు పెట్టుబడులు పెట్టి సేద్యం చేసిన రైతులకు అనుకోకుండా ఎదురైన నీటి కొరత ఏర్పడింది. దాన్ని అధిగమించి ఎలాగైనా పంటలను కాపాడుకోవాల నుకుని సాగర్ కాలువలో బావులు తీస్తే వాటిని అధికారులు ఒక్కసారిగా పూడ్చివేశారు. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో అన్నదాతలు తలలుపట్టుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. నీరులేక పంటలు నిలువునా ఎండిపోతే పెట్టిన పెట్టుబడి కూడా రాకపోగా అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి నెలకొందని కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు మానవతాదృక్పథంతో ఆలోచించి పదిరోజులు బావులు పూడ్చకుండా ఉన్నట్లైతే నోటికాడికొచ్చిన పంటలు ఇల్లు చేరేవని అన్నదాతలు తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారు. అధికారులు చేసిన పనికి పంటలు నిలువునా ఎండిపోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులకు సాగర్‌నీరు నీటిపైనే ఆధారపడి పంటలు సాగుచేస్తుంటారు. రైతులు తీసిన బావులను పూడ్చటంతో మూగజీవాలు కూడా తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ఎండి పోతున్న వరి పంట


కాల్వలో నీరు తాగుతున్న పశువులు

ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై అవగాహన అవసరం

- ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ప్రతీక్‌జైన్

కొత్తగూడెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని పినపాక నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణ తరగతులను, అసెంబ్లీ కాన్‌స్టెన్సీ లెవల్ మాస్టర్ ట్రైనీలు ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి ఫారం 12, 12ఏలను శిక్షణ కేంద్రాల్లో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు 254మంది సిబ్బంది హాజరయ్యారని, పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఈఆర్వో రాఘవరెడ్డి, నోడల్ ఆఫీసర్ బాబురావు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి


షాలెంరాజును సన్మానిస్తున్న సింగరేణి అధికారులు

సత్తుపల్లి, ఏప్రిల్1: కొత్తగూడెం ఏరియా పరిధిలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు, అన్ని యూనియన్ల సమష్టి కృషితోనే రికార్డ్ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో రికార్డ్ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగినందుకు గానూ సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లిలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజును సన్మానించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యానికి మించి జరగడంలో జీఎం సహకారం ఎంతో ఉందని అధికారుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.నరసింహారావు అన్నారు. అనంతరం జీఎం షాలెంరాజు మాట్లాడుతూ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా అధికారులు దుర్గాప్రసాద్, రామకృష్ణ, సుమలత, రవీందర్, రమేష్ ప్రహ్లాద్, ఉపేందర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వివక్షకు తావులేకుండా పథకాలు

» కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు, ఏప్రిల్1: కాంగ్రెస్ పాలనలో వివక్షతలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు, అన్ని ప్రాంతాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామని మహబుబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పస్టం చేశారు. సోమవారం ఇల్లెందులో జరిగిన కాంగ్రెస్ బూత్ కమిటీల నాయకుల విస్తృత సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పార్టీ నాయకులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ ఓటమి భయంతోనే ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారాలను అడ్డుకుంటుందని ఆరోపించారు. ఇల్లెందు నియోజకవర్గ ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో తాను ప్రచారానికి రాకపోయినా అధికార పార్టీకి సమానంగా తనకు ఓట్లు వేశారని వివరించారు. బీజేపీకి ఓట్లు వేస్తే 1/70 చట్టం ,రిజర్వేషన్లు రద్దు చేస్తారని హెచ్చరించారు. అపార ఖనిజ సంపదలు కలిగిన ఇల్లెందు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిచారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో బూత్ కమిటీలు కీలక పాత్ర వహించాలన్నారు. ప్రతి గడపగడపకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాల గురించి వివరించాలని తెలిపారు. బీజేపీ పాలనలో మైనార్టీలకు, ఎస్సీ, ఎస్టీలకు రక్షణ లేదని, బీఆర్ఎస్ మాదిరిగానే రానున్న ఎన్నికల్లో బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని 10ఏళ్లు పాలించి అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, సుదర్శన్ కోరి, దొడ్డ డానియల్, ఐఎన్‌టీయూసీ నాయకులు జే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బలరాం నాయక్

‘పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అభ్యంతరం లేదు’

వేంసూరు, ఏప్రిల్ 1: మండలంలోని కల్లూరుగూడెం గ్రామంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామస్థులు, మండల రైతులు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఒక అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడుతూ కల్లూరుగూడెంలో 42ఎకరాల్లో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కలెక్టర్ భూమిని కేటాయించారని తెలిపారు. ఆభూమిలో ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రామస్థుల తరపున ఎలాంటి అభ్యంతరం లేదని, కేటాయించిన భూమిలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో వేంసూరు, సత్తుపల్లి ప్రాంతాల పామాయిల్ రైతులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ లేకపోవడంతో పలువురు రైతులు 50కిలోమీటర్ల దూరంలోని అశ్వారావుపేట, అప్పారావుపేటల్లోని పామాయిల్ ఫ్యాక్టరీకి తమ ఉత్పత్తులను తీసుకువెళ్లాల్సి వస్తుందని అన్నారు. దీంతో కల్లూరుగూడెంలో ఫామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టాలని అంగీకార పత్రంలో కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బండి గురునాథరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, రాచూరి గంగరాజు, తుంబూరి రామిరెడ్డి, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పి.సోమిరెడ్డి, మందపాటి కేశవరెడ్డి, వేల్పుల బుచ్చాలు, దొడ్డా గణపతిరెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.


అంగీకారపత్రం అందజేస్తున్న రైతులు

జలగం వెంకటరావును కలిసిన
సత్తుపల్లి బీజేపీ నాయకులు

సత్తుపల్లి, ఏప్రిల్1: ఇటీవల భారతీయ జనతా పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావును సత్తుపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జలగం వెంకటరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆచంట నాగస్వామి, బోర్రా నరసింహారావులు పాల్గొన్నారు.


జలగంను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పింజరమడుగు లిఫ్ట్ ఇరిగేషన్
కాల్వకు మరమ్మతులు

కామేపల్లి, ఏప్రిల్1: కామేపల్లి మండల పరిధిలోని పింజరమడుగు జవహర్‌లాల్ లిఫ్ట్ ఇరిగేషన్ మోటర్లు గత రెండు ఏళ్లుగా మూలనపడ్డాయి. దీంతో ఈ ఏడాది పంటకు నీటి ఎద్దడి తలెత్తింది. లిఫ్ట్ ద్వారా చెరువులోకి నీటిని డంపింగ్ చేయకపోవడంతో చెరువులో నీళ్ల లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. కాగా సోమవారం రైతులు, గ్రామస్థులు కాల్వ పూడిక పనులు చేపట్టారు. ఈ పనులను మాజీ ఉప సర్పంచ్ వింజం నాగభూషణం, గ్రామస్థులు గుగులోత్ బాషా తదితరులు ఉన్నారు.


పూడిక పనులు చేపడుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

» జిల్లాలో 153 కొనుగోలు కేంద్రాలు » తేమశాతం లేకుండా తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలి: డీఎస్వో


గంగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్1: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల ఆధ్వర్యంలో 153 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నేటి నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. సత్తుపల్లి మండలం గంగారం గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం , తల్లాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాలను తనతో పాటు పౌరసరఫరాల సంస్థ జిల్లా మెనేజర్ తదితరులు పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా రైతులు విధిగా నిబంధనల ప్రకారం తేమశాతం 17 ఉండేలా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే కనీస మద్దతు ధరను పొందడంతో పాటు నేరుగా రైతుల ఖాతాలో సొమ్మును జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను సద్వినియోగించుకోవాలని డీఎస్వో చందన్‌కుమార్ కోరారు.

సస్పెన్స్ గుమ్మంలో ‘ఖమ్మం’

ఖమ్మం,ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం పార్లమెంట్ వ్యవహారాన్ని కాంగ్రెస్ అదిష్టానం ఇంకా తేల్చలేదు. రాష్ట్రంలో నాలుగు పెండింగ్ లోక్ సభ నియోజకవర్గాల్లో మూడింటికి ఓ కే చేసినా.. ఖమ్మం విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు నిర్ణయాధికారాన్ని అప్పగించారు. దాంతో రాష్ట్ర కాంగ్రెస్‌ప్రముఖులందరినీ సంప్రదించి నేడో రేపో నిర్ణయం తీసుకోబోతున్నారు. ముగ్గురు మంత్రుల నుంచి బంధుగణం తుమ్మల యుగంధర్, మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డి పోటీ పడుతుండగా మరికొందరు ఔత్సాహికులు కూడా టికెట్ కోసం గట్టి ప్రయత్నాల్లో ఉండటంతో అదిష్టానం సోమవారం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఖమ్మం టికెట్ వ్యవహారాన్ని వాయిదా వేశారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో అదిష్టానం మరికొంత జాప్యం చేసే అవకాశం ఉంది.

పాలేరు జవహర్ నవోదయ ప్రవేశ ఫలితాల వెల్లడి

కూసుమంచి, ఏప్రిల్ 1: పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి గాను జనవరి 20న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు ఎంపికైన విద్యార్థుల హాల్‌టికెట్ల నెంబర్లను ప్రిన్సిపాల్ సోమవారం విడుదల చేశారు. మొత్తం 80సీట్ల భర్తీకిగాను నిర్వహించిన పరీక్షకు 3,140 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2,492మంది పరీక్షకు హాజరయ్యారు. ఈమేరకు ఫలితాలను నవోదయ విద్యాలయ వెబ్‌సైట్లో విద్యార్థులు చూసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ రోల్ నంబరు పుట్టినతేదీ వివరాలను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు పొందొచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తారని తెలిపారు.

పోలింగ్ విధులపై అప్రమత్తంగా ఉండాలి

» ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక


వీవీప్యాట్ల పనితీరును వివరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 1: పోలింగ్ విధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంకలు అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల, ఈవీఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన పొందాలన్నారు. పోలింగ్ ఏజెంట్లకు సీక్రెసీ ఓటింగ్, పోలింగ్ నియమాలపై వివరించాలని, పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వారికి వివరించాలని సూచించారు. రిజల్ట్ చూసిన తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేసిన తర్వాత పోలింగుకు సన్నద్ధం కావాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలని అన్నారు. ఓటింగు గోప్యత, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాలెట్ గోప్యతను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారం-7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలింగ్ స్టేషన్ బయట ప్రదర్శించాలని, ఓటర్లకు అవసరమైన సహాయం అందించడానికి బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఫారం-12ఏ, ఫారం-12 ద్వారా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోస్టల్ బ్యాలెట్‌లు పొంది, ఖచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్ హెల్ప్ లైన్, సి-విజిల్ యాప్‌లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సీ విజిల్‌పైన ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. కొత్తగూడెంలో శిక్షణా కార్యక్రమానికి హాజరుకాని మొత్తం 1279 మందికి గాను 90 మంది గైర్హాజరయ్యారన్నారు. వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. అదే విధంగా పాల్వంచలోని అనుబోసు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల సిబ్బంది శిక్షణా తరగతి కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ హాజరై పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, ఎస్డీసీ రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో గణేష్, కొత్తగూడెం ఏఆర్వో మధు, ఆర్వో కాశయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 3న ఓటర్ అవేర్నెస్ 5కె రన్

కొత్తగూడెం కలెక్టరేట్: ప్రజల్లో ఓటర్ అవేర్నెస్ (ఓటర్ చైతన్యం) కల్పించేందుకు ఈనెల 3న 5కె రన్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పోస్టాఫీస్ కూడలి నుంచి పారెస్టు సెంట్రల్ పార్కు వరకు ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

గంజాయి కేసులో ముగ్గురికి 20ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్1: గంజాయి రవాణా కేసులో ముగ్గురు నిందితులకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. 2021లో ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్‌రోడ్డులో తనిఖీలు చేస్తుండగా, రెండు వాహనాలల్లో 170 కేజీల 190గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. గంజాయి తరలిస్తున్న నిందితులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా చోడవరం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయి, విశాఖపట్నం రూరల్ జిల్లా నర్సిపట్నం గ్రామానికి చెందిన టి.వెంకటసత్యనారాయణ, ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన గుంజి నాగరాజులపై నేరం రుజువుకావటంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు వాదించారు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 1: కోళ్ల విషయంలో జరిగిన ఘర్షణలో ఓవ్యక్తిపై దాడి చేసిన ఘటనలో మాజీ సర్పంచ్‌తో పాటు నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడివల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణకు చెందిన ఇంటి ఆవరణలో ఓ చెట్టు ఉంది. ఈచెట్టుపై మాజీ సర్పంచ్ సీతకు చెందిన కోళ్లు ఎక్కి రాత్రి వేళల్లో ఉంటున్నాయి. కాగా కోళ్ల పెంట వలన దుర్వాసన వస్తుందని గత నెల 25న ఆమెకు తెలియజేశాడు. ఇదే విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, శివరామకృష్ణ, అతని తల్లి గంగమ్మపై ఆమె కుటుంబసభ్యులు దాడి చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు మాజీ సర్పంచ్‌తో పాటు కొడిమి వెంకన్నబాబు, వినోద్, బి.కొండపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై దాడి...ద్విచక్రవాహనం కాల్చివేత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 1: సినీ ఫక్కీలో యువతి బంధువులు యువకుడిపై దాడి చేసి అతని ద్విచక్రవాహనాన్ని దహనం చేసిన సంఘటన సోమవారం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో జరిగింది. ఎస్ఐ పోటు గణేష్ తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన ఓ యువతీ, యువకుడు సోమవారం పర్ణశాలకు ద్విచక్రవాహనంపై వచ్చారు. పర్ణశాల పార్కింగ్ ప్రాంతంలో వారిద్దరు ఉండగా, అక్కడికి కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు యువకుడిపై కర్రలతో దాడి చేసి, అక్కడి నుంచి తరిమారు. పారిపోయిన యువకుడి ద్విచక్ర వాహనం నుంచి పెట్రోలు తీసి దాన్ని తగలబెట్టారు. అక్కడే ఉన్న యువతిని కారు ఎక్కించుకొని వెళ్లిపోయారు. పర్ణశాల గ్రామస్థులు కారును ఆపి వివరాలు అడగ్గా, వారి చెల్లి ఆచూకీ కోసం పర్ణశాల వచ్చి, ఆమెను తమ వెంట తీసుకెళ్తున్నామని గ్రామస్థులకు చెప్పారు. వారిది మహబూబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన వారుగా తెలిపారు. కాగా ఈ విషయంపై పర్ణశాల గ్రామస్థుడు తెల్లం హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఖమ్మంక్రైం, ఏప్రిల్1: రైల్వేస్టేషన్‌లో పలు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని రైల్వే స్టేషన్‌లోని 2వ ప్లాట్‌ఫారంపై సోమవారం తనిఖీ చేస్తుండగా ఖమ్మంరూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన వరకుమార్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆరునెలలుగా నేరాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో అతడి వద్ద నుంచి 5 తులాల బంగారం రికవరీ చేసి, కేసు నమోదు చేసినట్టు రైల్వే సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాలుగు సెల్‌ఫోన్లు అందజేత

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 1: సెల్‌ఫోన్ పోగుట్టుకొని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదుచేసుకున్న బాధితులు పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్లను సోమవారం ఖమ్మం రూరల్ పోలీసులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక మాట్లాడుతూ సెల్ ఫోన్ చోరీకి గురైనా, మిస్ అయినా ఐఎంఈఐ నంబర్ ద్వారా సీఈఐఆర్ పోర్టల్లో నమోదు చేస్తే సెల్‌ఫోన్ వెంటనే రికవరీ చేయటానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామారావు, పుష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 1: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన కె.మోహనరావు(43) గత నెల 30న గొర్రెలు కాసి రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటికి రాగా భార్య లలిత భోజనం పెట్టింది. ఆలస్యంగా భోజనం పెట్టిందంటూ భార్యపై దాడికి దిగగా, పిల్లలు అడ్డురాగా వారిపైనా దాడి చేశాడు. తండ్రి కొట్టడంతో మనస్తాపానికి గురై పెద్ద కుమార్తె దుర్గా భవాని బావిలో దూకింది. వెంటనే స్థానికులు ఆమెను రక్షించారు. అయితే కుమార్తె బావిలో దూకిందన్న విషయం తెలుసుకున్న అతడు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో కొత్తగూడెం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వార్షిక లక్ష్యాన్ని సాధించిన సింగరేణి

» హర్షం వ్యక్తం చేసిన సీఎంఓఏఐ అధికారులు

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి)/మణుగూరుటౌన్, ఏప్రిల్1: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 2023-24 సంవత్సర వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నుల బొగ్గును సాధించడం పట్ల సింగరేణి సీఎంఓఏఐ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో సాధించి రికార్డులు సృష్టించింది. దీంతో సింగరేణి కార్మికులు ఏడాది ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థలో వచ్చిన లాభాల్లో కార్మికులకు లాభాల వాటాను సైతం తీసుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి సింగరేణి యాజమాన్యం 100శాతం లక్ష్యాన్ని పూర్తి చేసుకుని 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించింది. భూగర్భ బావుల్లో బొగ్గు ఉత్పత్తి ఆశాజనకంగా లేకున్నప్పటికీ ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తిని అధికంగా తీయడం ద్వారానే ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నెరవేరిందని చెప్పవచ్చు. సింగరేణి అధికారులు, కార్మికులు సమష్టి కృషి ఫలితంగా లక్ష్యం నెరవేరడంతో యాజమాన్యం రానున్న ఐదు సంవత్సరాలకు 90మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. బలరాం ఎప్పటికప్పుడు ఓపెన్‌కాస్టులను తనిఖీలు చేస్తూ ఉత్పత్తి లక్ష్యం వైపు కార్మికులను ప్రోత్సహిస్తు వారి అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టడంతో ఉత్పత్తి లక్ష్యం అనుకున్న స్థాయిలో నెరవేరిందని చెప్పవచ్చు. ఉత్పత్తి లక్ష్యం నెరవేరడంతో సింగరేణికి పెద్ద ఎత్తున ఈ ఆర్థిక సంవత్సరం కూడా సింగరేణిలో అధికంగా లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉత్పత్తి సాధించిన ఏరియాల వివరాలు.. కొత్తగూడెం ఏరియాలో 118 శాతం, ఇల్లెందు ఏరియా 90శాతం, మందమర్రి ఏరియా 119శాతం, శ్రీరాంపూర్ ఏరియా 120శాతం, రామగుండం-1 ఏరియా 150శాతం, రామగుండం-2 ఏరియా 125శాతం, అడ్రియాల ప్రాజెక్టు 109 శాతం, భూపాలపల్లి ఏరియా 101శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. దీంతో తెలంగాణ ప్రాంతంలోని అతిపెద్ద బొగ్గు పరిశ్రమ అయిన సింగరేణిలో నూతన బొగ్గుబావుల ఏర్పాటుపై కొత్త ఆశలు సైతం చిగురిస్తున్నాయని చెప్పవచ్చు. ఉత్పత్తి లక్ష్యం సాధించడంతో సింగరేణి వ్యాప్తంగా సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో సింగరేణి అధికారులు, కార్మికులు కలిసి మిఠాయిలు పంచుకుని సంబురాల్లో మునిగిపోయారు. అనంతరం సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచి అధ్యక్షులు, మణుగూరు ఏరియా పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీపతి గౌడ్, సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, అల్విన్‌లను కలసి లక్ష్యం సాధించడంపట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సంఘం నాయకులు పీ నర్సింహులు, పొనుగోటి శ్రీనివాస్, కిరణ్ రాజ్‌కుమార్, పీ మోహన్‌రావు, డాక్టర్ విష్ణు, మదార్ తదితరులు పాల్గొన్నారు.


సీఎండీ బలరాంనాయక్‌ను సన్మానిస్తున్న ఉద్యోగసంఘాల ప్రతినిధులు

మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య వాహనం తనిఖీ

మణుగూరుటౌన్, ఏప్రిల్1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు పట్టణంలో సోమవారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై వస్తున్న భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కారును సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌లు తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ జ్యోతితోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. మండల కేంద్రమైన అశ్వాపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాలను నిలిపి సోదాలు జరిపారు. అక్రమంగా వాహనాల్లో డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే వీరయ్య కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నగరపాలక సంస్థకు రూ.30.87కోట్ల ఆదాయం

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్1: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఖమ్మం నగరపాలకసంస్థ గణనీయంగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఆస్తిపన్నులు, ట్రేడ్‌లైసెన్స్‌లు ఫీజుల వసూళ్లలో పురోభివృద్ధి ఉన్నప్పటికీ, పంపుపన్నుల వసూళ్లలో వెనుకబడ్డారు. ఆస్తి పన్ను లక్ష్యం రూ.32.81కోట్లు కాగా, 30.87కోట్లు వసూలు చేయగలిగారు. నగరపాలకసంస్థ పరిధిలో 79454 నివాసాలు ఉండగా, 55,710 నివాసాల వద్ద నుంచి ఆస్తిపన్నులు వసూలు అయ్యాయి. నగరపాలకసంస్థ పరిధిలో 6218 దుకాణాలు ఉండగా, ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు రూ.1.80లక్షలు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.1.10కోట్లు వసూలు చేశారు. పంపుపన్నులు రూ.9.10కోట్లు వసూలు చేయాల్సిఉండగా, కేవలం రూ.3.40 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మార్చి 31నాటికి నగరపాలకసంస్థకు రూ.35.37కోట్లు ఆదాయం వచ్చింది.

2004-25 ఏడాదికి సంబంధించి ఆస్తిపన్నులు ఈనెల 30వరకు చెల్లిస్తే ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ ఇవ్వనున్నారు. అధికారులు 42,316మంది గృహయజమానులు అర్హులని లెక్కలు తీశారు. గత ఏడాది ఇదే పథకం కింద రూ.9కోట్లు ఆదాయం వచ్చింది.


ఖమ్మం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా సంబురాలు చేసుకుంటున్న దృశ్యం

ఆటో మినీవ్యాన్ ఢీ

ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

కారేపల్లి ఏప్రిల్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కారేపల్లి క్రాస్‌రోడ్డులో సోమవారం ఓ ఆటో మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని కొత్తతండా నుంచి ఓ ఆటో ప్రయాణికులతో ఖమ్మం వెళుతుండగా కారేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద కారేపల్లి వైపునకు వెళుతున్న గ్యాస్‌డెలవరీ వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో ప్రయాణికుల ఆటోలు ప్రయాణిస్తున్న దారావత్ భీముడు, దారావత్ మారోని, దారావత్ నాగరాజు గాయపడ్డారు. వారిలో భీముడు పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని 108 ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కామేపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి బైక్ మద్దిగూడెం సమీపంలో పడిపోయింది. ఈఘటనలో ఓ వ్యక్తి తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. ఆ వ్యక్తి స్పృహలో లేకపోవడంతో వివరాలు తెలియలేదు. ఆవ్యక్తిని 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం ఏప్రిల్ 1: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి తెట్టెమడుగు అటవీప్రాంతంలో సోమవారం పోలీసు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డీఆర్జీ, కోబ్రా 208, 204 బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. సంఘటనా స్థలం నుంచి మృతదేహంతో పాటు ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన మావోయిస్టు వివరాల కోసం విచారణ చేస్తున్నట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు.

బెల్టుషాపులో మద్యం సీజ్

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 1: మండల పరిధిలో పెద్దతండా ఆర్టీసీ కాలనీలోని ఓ బెల్టుషాపులో విక్రయిస్తున్న సుమారు రూ.3వేల విలువైన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. మద్యం సీజ్‌చేసి బెల్టుషాపు నిర్వాహకుడు వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

100కు డయల్‌తో సత్వర స్పందన

» ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన పోలీసులు
» కానిస్టేబుల్ కృష్ణ, హోంగార్డు వీరన్నలను అభినందించిన అధికారులు

మణుగూరుటౌన్, ఏప్రిల్1: మణుగూరు పోలీసులు ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పూల కొట్ల సెంటర్‌లో బ్లూ కోట్ విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ కృష్ణ, హోంగార్డు వీరన్నలకు 100 నుంచి ఓ వ్యక్తి ఉరి వేసుకుని చనిపోతున్నట్లు సమాచారమందింది. దీంతో వెంటనే హుటాహుటిన బాంబేకాలనీ సమీపంలో చంద్రబాబునగర్‌కు వెళ్లగా గుగులోత్ రవి అనే 30 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నాడు. పోలీసులు వెంటనే ఇంటి తలుపులను పగులగొట్టి ఆపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని కిందకు దించి, సీపీఆర్ విధానంతో ప్రాణాలను కాపాడారు.

100కు డయల్ చేసిన వెంటనే సత్వరంగా స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను చంద్రబాబునగర్ స్థానికులతోపాటు ఎస్డీపీఓ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌లు అభినందించారు. కాగా మార్చిలో శివారాత్రి రోజున కొండాయిగూడెం గోదావరి నదిలో మణుగూరు పోలీసులు ముగ్గురు వ్యక్తులను కాపాడిన సంఘటన మరవకముందే నెల రోజుల వ్యధిలోనే పోలీసులు మరో ప్రాణాన్ని కాపాడటంపై పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.


ప్రాణాలు కాపాడిన రవితో కానిస్టేబుల్ కృష్ణ, వీరన్న

అదనపు డీఎంహెచ్‌వోగా డాక్టర్ భాస్కర్‌నాయక్ బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, ఏప్రిల్ 1: భద్రాచలం ఐటీడీఏలోని అదనపు డీఎంహెచ్‌వో(టీ)గా డాక్టర్ ఎల్.భాస్కర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు అడిషనల్ డీఎంహెచ్‌వోగా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌నాయక్ సోమవారం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమయంలో వేసవి కాలాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పకడ్బందీగా చేపట్టనున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటఎంసీహెచ్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.


పీవోకు పూలమొక్క అందజేస్తున్న దృశ్యం

తునికాకు సేకరణ పనులు చేపట్టాలి

ములకలపల్లి, ఏప్రిల్ 1: ఈ సంవత్సరానికి సంబంధించిన తునికాకు సీజన్‌లో ఆకుసేకరణ పనులు సకాలంలో చేపట్టి ఏజెన్సీ ప్రాంతం పేదలకు, ఆదివాసీలకు ఉపాధి కల్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2024 తునికాకు సీజన్‌లో వేలం కాని యూనిట్లను వెంటనే ప్రభుత్వమే చేపట్టి ఆకుసేకరణ చర్యలు తీసుకోవాలని, 50 ఆకుల కట్టకు రూ.5లు ధర నిర్ణయించాలని, బీడీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, బోనస్ బకాయిలు వెంటనే కార్మికులకు చెల్లించాలని, కల్లేదారి కమీషన్ పెంచాలని కోరుతూ సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ములకలపల్లి మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీను పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు వితరణ

దుమ్ముగూడెం ఏప్రిల్ 1: సీతానగరం అగ్నిప్రమాద బాధిత కొప్పుల నీలయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిలకా వెంకటరమణారెడ్డి సోమవారం పరామర్శించారు. నలభై కేజీల బియ్యం, కూరగాయాలు, నిత్యావసరాలను అందజేశారు. మాజీ సర్పంచి తెల్లం వరలక్ష్మి, రఘు తదితరులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటే..

- రోడ్డు నిర్మించిన కొద్దిరోజులకే ఆర్‌అండ్‌బీ రహదారి ధ్వంసం
- రూ. కోట్ల ప్రజాధనం వృథా
- నాణ్యతకు తిలోదకాలు ఇచ్చిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

మణుగూరు రూరల్, ఏప్రిల్ 1: రోడ్డు పోసిన మూడు రోజులకే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి ముక్కలు చెక్కలుగా నెర్రెలు బారి దర్శనమిస్తుంది. ప్రజా ధనం హ్వాదా చేయడంలో ఆర్‌అండ్‌బీ అధికారుల తీరు కళ్లకు కొట్టోచ్చినట్లుగా కన్పిస్తోంది. సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన ఈ రోడ్డు, మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. వివరాల్లోకి వెళ్లితే..

మణుగూరు నుంచి ఏడూళ్ల బయ్యారం వరకు ఉండే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. బీటీపీఎస్ పవర్‌ప్లాంట్‌కు నిత్యం బొగ్గు లారీలు వందల సంఖ్యలో తిరుగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని అనేక ప్రాణాలు పొయిన సంఘటనలు ఉన్నాయి. పలు రాజకీయ పక్షాలు రోడ్డు పనులు చేపట్టాలని ఆందోళనలు సైతం చేపట్టాయి. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం సుమారు రూ. ఏడు కోట్ల నిధులను మంజూరి చేసింది. ఈ నిధులతో ఆర్‌అండ్‌బీ అధికారులు కొద్ది రోజుల క్రితం నుంచి మణుగూరులోని సీఎస్ పి కాంటా నుంచి ఏడూళ్ల బయ్యారం వరకు రోడ్డు పను లు చేపట్టారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పోసిన మూడు రోజులకే నెర్రలు బారి చెక్కలు ముక్కలుగా దర్శన మిస్తోంది. రోడ్డు పనులు చేపట్టే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తే దారు డు ఇష్టాను సారంగా రోడ్డు పనులు చేపట్టారనే ఆరోపణ లు వెల్లు వెత్తుతున్నాయి. రూ. కోట్లతో చేపట్టిన ఈ పను లు అనతి కాలంలోనే ధ్వంసం కావడంతో ఆ శాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. కోట్లాది రూపాయాల ప్రజాధనం ప్రధాన కారణం సంబంధింత శాఖ అధికారులేనని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరించడంతో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలో దకాలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విజయనగరం, సాంబాయిగూడెం, దమ్మక్కపేట, చుక్కుడు గుంట తదితర ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా పగిలిపోయి గుంటల మయంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


దమ్మక్కపేట వద్ద ధ్వంసమైన రోడ్డు

మరమ్మతులు చేపడతాం

సురేష్, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ

భారీ లోడ్‌లతో లారీలు తిరుగుతుండటం వల్ల అక్కడక్కడ రోడ్డు ధ్వసంమైంది. దీనికి వెంటనే మరమ్మతులు చేపటతాం.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 1: డోబీ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పది నెలల జీత భత్యాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న డిమాండ్‌చేశారు. సోమవారం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధామోహన్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకుండా ఇబ్బందులుకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి డోబీ కార్మికుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, కార్మికు లు సురేందర్, నిర్మల, భాగ్యశ్రీ, కుమారస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 1: గుట్ట వెంకన్న వార్షిక కల్యాణం ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వైభవంగా నగరసంకీర్తన నిర్వహించారు. స్వామివారి మహిళ భక్త మండలి ఆధ్వర్యంలో గట్టాయిగూడెం, విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ ప్రాంతాల్లో గోవిందనామస్మరణ, భక్తి గీతాలాపనలతో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో మేకల రేణుక, కల్యాణి, జయమ్మ, జయ ప్రకాష్, చారి, నాగలక్ష్మి, రమ్య, కిరణ్, త్రినాథ్, శృతి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరస్తులకు చెక్: భద్రాచలం ఏఎస్పీ

భద్రాచలం, ఏప్రిల్ 1: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సోమవారం భద్రాచలం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆటో యూనియన్, ఇండస్ట్రియల్ యూనియన్ నాయకులు అందజేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారిని అభినందించారు. అనంతరం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారస్తులు మరింత మంది సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు మధు ప్రసాద్, ఎస్ఐ పీవీఎన్‌రావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కళాకారులు ప్రజలను కోరారు. సోమవారం జూలూరుపాడులో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఓటు హక్కు వినియోగం పై ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఓటు వజ్రాయుధం వంటిదని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండ ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం లీడర్ కాంపల్లి బాబు, కళాకారులు నందు, మూసా, నరేంద్ర, కుమారి, నీలా, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు నిలిపివేయడం దారుణం

చుంచుపల్లి, ఏప్రిల్1: కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలు నిలిపివేయడం దారుణమైన చర్యలని ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని చుంచుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు అంథోటిపాల్ మండిపడ్డారు. సోమవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నల్లరిబ్బన్‌లు ధరించి నిర్వహించారు. తక్షణమే ఆ ఖాతాలను రిలీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్డీఎం కో-ఆర్డినేటర్ బద్దె కిషోర్, ఐఎన్‌టీయూసీ నాయకులు జలీల్ రామ్మూర్తికుమార్, మైనార్టీ సెల్ నాయకులు అక్బర్, ఫైజుద్దీన్, ఖాదర్, ఎస్టీ సెల్ నాయకులు అరుణ్‌నాయక్, యూత్ నాయకులు అంథోటి రాజు, సందీప్, దిలీప్, గద్దం నితీన్, సిరి, సాత్విక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట, ఏప్రిల్ 1: వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. నాగుపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒగ్గు లక్ష్మినారాయణనను పరామర్శించారు. నాచారం గ్రామంలో తుమ్మల సోదరుని మామ గూడపాటి భద్రయ్య మృతి చెందటంతో ఆకుటుంబాన్ని పరామర్శించారు. భద్రయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అంతకు ముందు గండుగులపల్లిలో దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తుమ్మలను కలిశారు. ఆయన వెంట పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, డొడ్డా ప్రసాదు, కేవి సత్యనారాయణ, శ్రీరాముల ప్రసాదు, బుద్దె కోటేశ్వరరావు తదితరులున్నారు.


భద్రయ్య చిత్రపటం వద్ద తుమ్మల నివాళి

మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు: సీఐ

జూలూరుపాడు, ఏప్రిల్ 1: వ్యాపారులు మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి జూలూరుపాడులోని పాన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, గంజాయి చాక్లెట్స్, ఇతర మత్తు పదార్థాలను విక్రయించవద్దన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. అదేవిధంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. గ్రామంలో బెట్టింగ్‌లు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఇరుగు జీవన్‌రాజు, సిబ్బంది రామకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

మణుగూరు, ఏప్రిల్ 1:మణుగూరు. అశ్వాపురం, పినపాక, కరకగూ డెం మండలాల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సోమవరం మణుగూరు పట్టణ ప్రాంతంలో కవాతుని నిర్వహించారు. స్నేహా గార్డెన్స్ నుంచి కిన్నెర కళ్యాణ మండపం వరకు ఈ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారామ్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌ఎస్‌ఎస్ మణుగూరు ఖండ కార్యకర్తలు పాల్గొన్నారు.


మణుగూరులో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: వైరా ఎమ్మెల్యే

జూలూరుపాడు, ఏప్రిల్ 1: అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అన్నారుపాడు, పాపకొల్లు, బోజ్యాతండా, గంగారం తండా, అనంతారం గ్రామాల్లో పర్యటించి పలు శుభకార్యాలతోపాటు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బోజ్యాతండాలో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించి ఇందిరమ్మ ఇళ్లను మంజూ రు చేయాలని కోరారు. అనంతారం గ్రామంలో ఈ నెల 4న వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ, కాకర్లలోని పాలగుట్టపై శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ కల్యాణం కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటంతో ఆలయకమిటీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్‌రావు, పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్‌నాయక్, నాయకులు రోకటి సురేష్, లచ్చునాయక్, రామిశెట్టి రాంబాబు, ఎస్. పుల్లారావు, వి. నర్సింహారావు, కుర్సం రమేష్ తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే

ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే జరిమానా: కమిషనర్

మణుగూరు, ఏప్రిల్ 1: మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్‌లను ఆక్రమించి వాహనాలు నిలిపినా సామగ్రిని పెట్టుకున్నా ఆ దుకాణదారులపై ఫైన్లు విధిస్తామని మణుగూరు కమిషనర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కరంగా సమస్య నెలకొనడంతో ఈ విధమైన చర్యలను చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అన్ని దుకాణాలకు మునిసిపాలిటీ తరుపున నోటీసులను సిబ్బంది అందజేశారు.

పోలీసుల సూచన

ఇది ఇలా ఉండగా ఆదివారం రాత్రి మణుగూరు ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తూ పట్టణ ప్రాంతంలో ఫుట్‌పాత్ పైకి వచ్చిన దుకాణ దారులను పిలిచి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా చిరు వ్యాపారుల దుకాణా దారులు తమ బడ్డీలను ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసుకోవడంతో ద్విచక్రవానాలు రోడ్డుపై పార్కు చేస్తున్నారని తెలిపారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని సూచించారు.


నోటీసులు అందజేస్తున్న మునిసిపల్ సిబ్బంది

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి: తహసీల్దార్

జూలూరుపాడు, ఏప్రిల్ 1: విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగినట్లైతే ఉన్నత స్థానాలకు సులువుగా చేరుకోవచ్చని తహసీల్దార్ స్వాతిబిందు అన్నారు. జూలూరుపాడు సాయి ఎక్స్‌లెంట్ పాఠశాలకు చెందిన తాటికొండ నాగశేషు, హలావత్ నందిత విద్యార్థులు నవోదయ పాఠశాలలో సీట్లు సాధించారు. దీంతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ ఇద్దరు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది హుస్సేన్, సీహెచ్. పుల్లారావు, కృష్ణయ్య, మోహన్, మనిదీప్, తల్లిదండ్రులు కొల్లిపాక సురేష్, నర్సింహారావు, చలపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం: బలరాంనాయక్

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 1: కాంగ్రెస్‌లోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ లోక్‌సభ మహబూబాబాద్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ అన్నారు. సోమవారం ఇల్లెందు మండలం ముకుందాపురం, నిజాంపేట గ్రామాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంకోసం కర్యకర్తలు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలుపు నేడు దేశానికి అవసరమని, బీజేపీ మళ్లి అధికారంలోకి వస్తే వ్యవస్థలు కుప్పకులుతాయని బలరాంనాయక్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పూనెం శ్రీరాములు, కల్తీ స్వామి, వర్స భద్రం, తుర్పాటి కనకయ్య, ఎండీ నలీం, దనియకుల బాబు, యల్లంపల్లి బుచ్చయ్య, ప్రసాద్, వీరభద్రం, బింగి కృష్ణ, చుక్క నాగరాజు, గాజుల వెంకన్న, ముత్యాలు,మూతి బుచ్చయ్య, కాటూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


బలరాంనాయక్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి: పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: పార్లమెంటు ఎన్నికల్లో మండల కాంగ్రెస్ సత్తా చాటాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. లక్ష్మీనగరంలో నూతన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. మహబూబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు మండలం నుంచి భారీ మెజారిటీ కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. పీసీసీ సభ్యులు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వినీల్, రవికుమార్, శోభన్‌బాబు, సూర్యచంద్రరావు, సుధాకర్, మాజీ సర్పంచులు చంద్రశేఖర్, చిన్నారావు, కృష్ణ, ఎంపీటీసీ వనజ, దేవా, హరికృష్ణ, వెంకటరమణారెడ్డి, సందీప్‌రెడ్డి, అప్పలరెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌ను ఆదుకోవాలి: కోదండరాంకు జిల్లా నాయకుల వినతి

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 1: రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్స్‌ను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను టీజేఎస్ జిల్లానాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో కోదండరాంను కలిసి వినతిపత్రం అందచేశారు. సొంతవారిని, జన్మభూమిని వదిలి దూర ప్రాంతాల్లో యాచన చేస్తూ దుర్భరంగా జీవిస్తున్నారని వారికి నివాస గృహాలతోపాటు నెలకు రూ. 4వేలు పెన్షన్ ఇప్పించేవిధంగా కృషి చేయాలని జిల్లా నాయకులు కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం, జిల్లా ప్రదాన కార్యదర్శి పి. కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని జమ్మిగూడెం గ్రామంలో సోమవారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ గణపతి, సుబ్రమ్మేశ్వరస్వామి, సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలను మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఘనంగా జరిపారు. సోమవారం ఉదయం 9.45గంటలకు ప్రతిష్టా మహోత్సవాన్ని జరిపారు. ప్రతిష్ట అనంతరం పూర్ణాహుతిని నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు భారీగా పాల్గొన్నారు. ఆలయంలో సాయంత్రం భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

రంజాన్ ఉపవాస దీక్షలు ముస్లింలకు పవిత్రమైనవి

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 1: రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముస్లీంలకు ఎంతో పవిత్రమైనవని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి పాత పాల్వంచలోని మక్కా మసీదులో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొని సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మజీద్‌కమిటీ నాయకులు సయ్యద్ యాకూబ్, మహ్మద్ ఖుర్షిద్, మహ్మద్ నసీర్, షేక్ రెహమాన్, సయ్యద్ ఖరీం, సయ్యద్ నజీర్, అబ్దుల్ జలీల్, కాంగ్రెస్ నాయకులు గండు భరత్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: బీఎస్పీ

జూలూరుపాడు, ఏప్రిల్ 1 : మండలంలోని వెంగన్నపాలెం పంచాయతీలో పలు వీధుల్లో తాగునీరు (మిషన్‌భగీరథ) సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నర్సింహారావు అన్నారు. వెంగన్నపాలెం పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీఎస్పీ నాయకులు, స్థానిక మహిళలు కలిసి వెంగన్నపాలెం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు భోగా లలిత, బానోతు లక్ష్మి, సొసైటీ డైరెక్టర్ కే. రజిని, కే. అనిత, కే. జ్యోతి, లక్ష్మీకాంతం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అన్ని గ్రామాలకు సరఫరా చేయాలి

దుమ్ముగూడెం ఏప్రిల్ 1: మిషన్ భగీరథ పథకం ద్వారా ట్యాంకులు, పైపులైన్లు నిర్మించిన అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పలు గ్రామాల ఆదివాసులు సోమవారం ధర్నా చేశారు. ధర్నాకు మద్దతు తెలిపిన అనంతరం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య మాట్లాడారు. గత ప్రభుత్వం భగీరథ పేరిట వేలకోట్లు ఖర్చు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందన్నారు.గ్రామాలకు సక్రమంగా తాగునీరందించడం లేదని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను వదలిపెట్టబోమని హెచ్చరించారు. ఎంపీవో ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు వి వినీల్, పీసీసీ సభ్యులు దుర్గాప్రసాద్, రవికుమార్, శోభన్‌బాబు, సూర్యచంద్రరావు, దేవా, చంద్రశేఖర్, తెల్లం హరికృష్ణ, బూరం మణికుమార్, వెంకటరమణారెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామా విజయంకోసం సైనికుల్లా పని చేయాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 1: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావు విజయంకోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ కోరారు. సోమవారం జూలూరుపాడులోని తన క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో నామాకు అత్యధిక మెజార్టీ తీసుకొచ్చే విధంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, నాయకులు పీజీ. కృష్ణమూర్తి, దుద్దుకూరి నాగేశ్వరరావు, చావా వెంకటరామారావు, సిరంశెట్టి అన్వేష్, చందర్, హరిలాల్ పాల్గొన్నారు.

దమ్మపేట బస్టాండ్‌ను సందర్శించిన డీఎం

దమ్మపేట, ఏప్రియల్ 1: దమ్మపేట బస్టాండ్‌ను సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి సోమవారం సందర్శించారు. ఆదునీకరించిన బస్టాండ్‌లో వసతులను పరిశీలించారు. డీఎం దమ్మపేట వచ్చారని సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు డీఎం కలిశారు. బస్టాండ్ పూర్తి స్థాయిలో ఆదునీకరించి సత్తుపల్లి డిపోకు చెందిన బస్సులు అశ్వారావుపేట వైపు వెళ్లే ప్రతీ బస్సు దమ్మపేట బస్టాండ్‌కు వచ్చి వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. డీఎంను కలిసిన వారిలో చిన్నంశెట్టి యుగంధర్, మాజీసర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు, పోతినేని వెంకట్రావు, పగడాల రాంబాబు, యార్లగడ్డ బాబు, వలీపాషా, గోపి, మల్లేశ్వరరావు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

- జీసీసీ మేనేజర్ నర్సింహారావు

దమ్మపేట/ ఇల్లెందు రూరల్/ అశ్వారావుపేట రూరల్ ఏప్రిల్ 1 : జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ద మ్మపేట జీసీసీ మేనేజర్ నర్సింహారావు కోరారు. గండుగులపల్లి, మల్కా రం, జగ్గారం, గణేష్‌పాడు, దమ్మపేట, మొద్దులగూడెంలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సో మవారం ఆయన ప్రారంభించారు. మార్చి 24న 'ఆంధ్రజ్యోతి'లో 'ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ఎన్న డో....?' కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పౌరసరఫరాల శాఖా అధికారులు దమ్మపేట మండలంలో ఆరు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మేనేజర్ మాట్లాడుతు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని గిట్టుబాటు ధరను పొందలన్నారు. ధాన్యం ఏగ్రేడ్ రకం క్వింటాకు 2203 రూ.లు, కామన్ రకానికి 2183 రూ.లు చెల్లిస్తామన్నారు. ఈకార్యక్రమంలో దొడ్డా ప్రసాదు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, దొడ్డా బాస్కరరావు, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గండుగులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చల్లసముద్రంలో..

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ ముకుందాపురం సెంటర్‌లో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సొసైటీ సీఈవో హరి తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం..

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. భద్రాచలం రోడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాయబ్ తహసీల్దారు సుచిత్ర మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఏడుకొండలు, ఏఈవో సతీశ్, సొసైటీ సీఈవో విజయ్ పాల్గొన్నారు.

దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడండి

- బీజేపీ, దాని మిత్ర పక్షాలను ఓడించాలి
- న్యూడెమోక్రసీ నాయకుడు మురళీకృష్ణ

మణుగూరు, ఏప్రిల్ 1: దేశంలో బీజేపీ మోదీ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార శక్తులు తమ విధానాలతో దేశానికి పెను ముప్పును తలపెడుతున్నారని దేశ సంపదలు కొల్లగొడుతూ గుజరాత్ అంబానీ, అదానీలకు అప్పగిస్తున్నారని అలాంటి వారిని జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు , పార్లమెంట్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. సోమవారం మణుగూరులోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీదాని మిత్రపక్షాలను ఓడించేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్డీ రాష్ట్ర నేత జే సీతారామయ్య, భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అదాని, అంబానీ కంపెనీలకు వనరులను దారదత్తం చేస్తూ ఆదివాసీలను అడవుల నుంచి బయటికి పంపే పనులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రవేటీకరణ దేశంలో చొచ్చుకువస్తోందని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలో విచ్చల విడిగా ప్రవేటు వ్యక్తులు ప్రవేశిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిలక్ష్మి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమా, ఆర్ లక్ష్మి, కొడెం రాధ, వినోదధ, కొండలరావు, సాదనాల రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మురళీ కృష్ణ